క్లుప్తంగా

హనుమంతుడికి విశేష పూజలు



విశేష అలంకారంలో ఆంజనేయస్వామి

కడప కల్చరల్ : కడప నగరం పెద్దబెస్తవీధిలోని లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి మూలవిరాట్‌కు తొలుత పంచామృతాభిషేకం, అనంతరం విశిష్ఠ ఫలాలు, ఇతర ద్రవ్యాలు, పుణ్యనదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యహవాచనంతోపాటు అభయాంజనేయ స్వామి మూలమూర్తికి విశేష ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నూతన వస్త్రాలు, సింధూరంతో అలంకరించారు. స్వామికి అత్యంత ఇష్టమైన పుష్పాలను సమర్పించారు.

మాజీ డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప రింగు రోడ్డులో చలమారెడ్డిపల్లె వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంపై మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం కడప రిమ్స్ మార్చురీ వద్దకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి వివరాలు తెలుసుకొని, వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ ప్రమాదంలో వడ్డెర సంఘం అధ్యక్షుడు చలమారెడ్డిపల్లె సుబ్బరాయుడు కుమారుడు మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శివప్రసాద్, షఫీ, బాలకొండయ్య, వేణుగోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : రహదారి భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జిల్లాలో పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యార్థులు, యువతకు, ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం తాగి వాహనం నడపడం, సీటు బెల్టు ఉపయోగించకపోవడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. విద్యార్థులు రోడ్ క్రాస్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మైనర్లకు వాహనం ఇవ్వకూడదని తల్లి దండ్రులకు సూచించారు.
పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదన్నారు.

మొక్క నాటి సంరక్షించాలి



మొక్కను నాటుతున్న మహిళా మోర్చా నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్క నాటి దానిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శోభా భాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ యాదవ్ తెలిపారు. మోదీ 11 ఏళ్ల పాలన సందర్భంగా కడప నగరంలోని అంబా భవానీ ఆలయం వద్ద తల్లి పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు తమ స్వార్థ ప్రయోజనాలకోసం చెట్లు నరకుతున్నారని, ఇది భవిష్యత్తులో తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చలపతి, సురేష్, లక్ష్మణ్‌రావు, సునీత, సంధ్య, ఆదిలక్ష్మి, పల్లవి, నాగిరెడ్డి, రమణ, ప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించండి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కడప బుచర్ స్ట్రీట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ మోడల్ ఉర్దూ స్కూల్ హెడ్‌మాస్టర్ ఎస్.సికిందర్‌బాషా కోరారు. బుచర్ స్ట్రీట్‌లో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సికిందర్‌బాషా మాట్లాడుతూ పిల్లలకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఎస్.నజీబుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ యూనిఫాం, బుక్స్, నోట్ బుక్స్, షూస్, స్కూల్ బ్యాగ్ ఉచితంగా అందిస్తారన్నారు. ప్రైవేట్ స్కూల్ మోజులో పడి తల్లిదండ్రులు వేలరూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అమినీటి షేక్‌నిజాం, ఎస్.జామిల్, నాయబ్‌రసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

• ఖరీఫ్ సాగుకు సిద్ధం..!

అనుకున్న సమయానికంటే ముందుగానే వర్షాలు పడుతుండడంతో వరి పైరు పెట్టేందుకు అన్నదాత సిద్ధమవుతున్నారు. వరి మడులను సిద్ధం చేసుకున్నారు. ఎరువు కోసం పొలంలో ఒకవైపు జీలుగ పెంచుతూ, మరో వైపు వరినారు వేశారు. ఇవి కాస్త పెరగగానే జీలుగను తొక్కించేసి, వరి నాట్లు నాటుతామని రైతులు చెబుతున్నారు. సిద్దవటం మండలం మాచుపల్లె పొలాల్లో శనివారం కనిపించిన దృశ్యాలివీ..







• జామును ముందే.. గ్లాసులో మందు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి మద్యం ఏరులై పారుతోంది. గత ప్రభుత్వం ఉదయం పది గంటలకు తెరిస్తే.. కూటమి ప్రభుత్వంలో కొన్ని దుకాణాలు ఏకంగా తెల్లవారుజామునే సిద్ధమవుతున్నాయి. గత ప్రభుత్వం యువకులకు మద్యం మాన్పించే దిశగా దశలవారీగా మద్యం విక్రయాలు తగ్గిస్తూ వచ్చింది. అయితే తాజాగా టీడీపీ ప్రభుత్వంలో నిబంధనలకు పాతర వేశారు. కడప నగరంలోనే తెల్లవారు జామునే దుకాణాలు తెరవడంతో మద్యం బాబులు పూటుగా తాగుతూ కనిపించిన దృశ్యాలివీ..





- సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

రక్తదానం మహత్తరమైన సేవ

మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



రక్తదాతలతో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రక్తదానం మహత్తరమైన మానవతా సేవ అని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా అన్నారు. ఎస్‌ఏక్యూ టెక్నాలజీస్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత రాణాప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 100 మంది విద్యార్థులు, యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా రక్తదాతలకు అభినందనలు తెలిపారు. రక్తం అవసరమైన ప్రతి వ్యక్తికి సహాయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, పి. రామ్మోహన్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ఆపత్కాలంలో ప్రాణదాతలుగా నిలవాలి



ఫాతిమా మెడికల్ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థిని

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రతి ఒక్కరూ ఆపత్కాలంలో రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.రవి బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కడప ఎయిర్‌పోర్టు, ఎన్‌వైకే కార్యాలయం, యూత్ హాస్టల్, సర్వజన ఆస్పత్రి సహకారంతో శనివారం పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్ల్ లాండ్ స్టైనేర్ జన్మదినం సందర్భంగా 2004 నుంచి ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఆరోగ్యవంతులై 18–45 కిలోల బరువు కలిగిన 60 ఏళ్లలోపు వారంతా 3–4 పర్యాయాలు రక్తదానం చేసేలా అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, ఏపీఎస్ ఏసీఎస్ క్లస్టర్ ప్రోగామ్ అధికారి వి.భాస్కర్ కోరారు.సుజిత్‌కుమార్, నిఖిల్ పాల్గొన్నారు.

ఫాతిమా కళాశాలలో..

ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శైలారేఖ, ఇతర వైద్యాధికారులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం.. మానవత్వానికి నిదర్శనం



రక్తదాతను అభినందిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడటమేగాక, మానవత్వానికి నిదర్శంగా నిలుస్తుందని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్.రవిబాబు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా కడప బాలాజీ నగర్‌లో జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ రక్తదాన సేవ మహోన్నత సేవా కార్యక్రమం అన్నారు. ఏపీ ఎస్‌ఏసీఎస్ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ప్రమాదాలు, శస్త్రచికిత్స, గర్భధారణ, చిన్న పిల్లల ఆరోగ్య సమస్యల సందర్భాల్లో రక్తం దొరకక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ సమస్య అధిగమించేందుకు ఆరోగ్యవంతుడు ప్రతి ఒక్కరూ కనీసం రెండు, మూడు సార్లు రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్, సభ్యులు సుమంత్, అరవింద్, నవీన్, రేవంత్, వసంత, రెడ్ క్రాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్: నీట్–2025 పరీక్షా ఫలితాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ అర్హత పోటీ పరీక్ష ఫలితాల్లో కడప నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. పల్లవి 743వ ర్యాంకు, రమ్యసాయి 16344, జోషిణి 18562, మహ్మద్ ఆమీన్ 19986, సలేహ 30074, సందురి 36184, సహస్ర 41549, లక్ష్మి చైతన్య 44990, అప్రిన్‌బాను 56369వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులను నారాయణ డీజీఎం రామోహన్‌రెడ్డి, కోర్ డీన్ చంద్ర కిషోర్ రెడ్డి, డీన్ సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ఏజీఎంలు చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపల్లు మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, సుమన్‌లు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

కడప ఎడ్యుకేషన్ : నీట్–2025 ఫలితాలలో కడప శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఆల్ ఇండియా అన్ని కేటగిరీలలో హ్రుతిక 14849వ ర్యాంకు, అన్నికారెడ్డి 23619, సునంద 46756, సత్య 51417వ ర్యాంకులు సాధించారు. చాలా మంది విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శ్రీచైతన్య తిరుపతి డివిజన్ ఏజీఎం బివి.ప్రసాద్, డీన్ కేఎల్‌జి.ప్రసాద్, ప్రిన్సిపల్స్ నాగరాజు, ప్రవీణ్, పరమేశ్వర్ రెడ్డి, శివప్రసాద్, అడ్మిన్ ఆఫీసర్ మనోజ్, మల్లికార్జున స్వామి అభినందించారు.



విద్యార్థులతో ఆకాస్ విద్యా సంస్థల ప్రతినిధులు

సత్తా చాటిన ఆకాస్

కడప ఎడ్యుకేషన్ : నీట్ ఫలితాల్లో కడప ఆకాస్ విద్యా సంస్థ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో డింపుల్ 720 మార్కులకు 533 మార్కులు సాధించి మొదటి స్థానం, మోక్షిత 521 ద్వితీయస్థానంలో నిలిచారు. అబ్దుల్ రెహమాన్, బాలాజీ, జాహ్నవి, హర్షితలు మెరుగైన ఫలితాలను సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను స్టేట్ హెడ్ నారాయణమూర్తి, నిషాంట్‌మిశ్రా, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఏరియా సేల్స్ హెడ్ నరసింహులు, అకడమిక్ హెడ్స్ అప్సర్‌బాషా, సుబ్రమణ్యం, బ్రాంచ్ మేనేజర్ సుదాకర్‌రావు, మహేష్ అభినందించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పెండ్లిమర్రి : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించాలని సీఐ చల్లని దొర తెలిపారు. శనివారం మండలంలోని వెల్లటూరు వద్ద వాహనాల తనిఖీ చేపట్టి రోడ్డు భద్రత నియమాల గురించి వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అనంతరం రికార్డు సక్రమంగా లేకుండా తిరుగుతున్న వాహనాలను అదుపులోకి తీసుకుని జరిమానాలు విధించారు.

పుష్పగిరి ఆలయానికి 'ఇన్వర్టర్' ఇప్పించండి!

కడప కల్చరల్ : ప్రముఖ పంచనది క్షేత్రమైన పుష్పగిరి ఆలయానికి ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలని చరిత్ర కారులు బొమ్మిశెట్టి రమేష్ కోరారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ క్షేత్రానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, వసతుల లోపమే ప్రధాన కారణమని తెలిపారు. భక్తులు వచ్చినపుడు కొద్దిసేపు గడిపేందుకు అవకాశం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ నేపథ్యం గల ఆలయంలో బల్బులు వెలగాలని, ఇందుకు ఇన్వర్టర్ అవసరం ఉందని తెలిపారు. దాతలు, భక్తులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ ఫెయిల్ అయిన వారు అర్హులని, అభ్యర్థులు 18–28 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. బెంగళూరులో 35 రోజులపాటు ఇచ్చే శిక్షణలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్‌స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : పదో తరగతిలో ప్రతిభ చూపిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ఆదివారం అందజేయనున్నట్లు తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షుడు కళ్యాసుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు తెలిపారు. సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం పది గంటలకు పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 59 మందికి నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ్య, కోశాధికారి టీకూరి సుదర్శన్, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, బొలిశెట్టివెంకటస్వామి, పల్లా బాల చౌడన్న, దొండ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

పరామర్శ

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన మాజీ సాక్షి విలేకరి ఈ రామలక్ష్మిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మృతుని కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

'న్యూ ఆక్సెస్' బైక్ విడుదల



నూతన వాహనాన్ని విడుదల చేస్తున్న సుజుకి సంస్థ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సుజుకీ మోటారు సంస్థ వారి నూతన న్యూ ఆక్సెస్ 125 టీఎఫ్‌టీ మోటారు బైక్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం కడప నగరంలోని ఖాజా సుజుకి షోరూంలో నూతన బైక్‌ను సుజుకి మోటారు సైకిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఏరియా మేనేజర్ (సేల్స్) వై.శివప్రసాద్ మొదటి కొనుగోలుదారు ఉషకు, ఏరియా మేనేజర్(సర్వీస్) రమణబాబు ద్వితీయ కొనుగోలుదారు దివ్య మాధురికి అందజేశారు. ఈ సందర్భంగా ఖాజా సుజుకి ఎండీ సయ్యద్ మహమ్మద్ సుహైల్ మాట్లాడుతూ ఇప్పటికే మార్కెట్‌లో సుజుకి యాక్సెస్ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం సరికొత్త టీఎఫ్‌టీ వాహనంలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ప్రధానంగా కలర్ డిజిటల్ మీటర్‌లో వెదర్ అలెర్ట్స్, న్యావిగేషన్, మెసెజ్ అలెర్ట్స్, వాట్సాప్ కాల్స్, మైలేజ్ రేంజ్, డే మోడ్, నైట్ మోడ్, లాస్ట్ పార్కింగ్ లొకేషన్ అలెర్ట్స్, స్పీడ్ ఎక్సీడింగ్ అలెర్ట్స్ తోపాటు ఆకర్షణీయమైన ఐదు రంగులలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు నూతన వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది, ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులుపాల్గొన్నారు.

జీతాలు ఇచ్చి కార్మికులను ఆదుకోండి

వేంపల్లె: గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు జీతాలు ఇచ్చి ఆదుకోవాలని సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. మైలవరం మండలం వేపరాల నుండి బదిలీపై వచ్చిన మాధవరెడ్డి వేంపల్లె గ్రామపంచాయతీ ఈఓగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈఓను మర్యాద పూర్వకంగా కలిసి గ్రామ పంచాయతీలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఆరునెలలుగా పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు సతమతమవుతున్నాయన్నారు. కాబట్టి వెంటనే జీతాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టి గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.ఈవో మాధవరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తల్లికి వందనం.. పూర్తిస్థాయిలో అమలుచేయాలి



కోటిరెడ్డి సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దురాహుల్, వీరపోగురవి అన్నారు. కడప కోటిరెడ్డి సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి 12 వరకు తరగతి చదువుతున్న ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికీ రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇపుడు మాట తప్పడం తగదన్నారు. 2024–25లో బురిడీ కొట్టింది.. ఇపుడు ఇచ్చిన సొమ్ములో రూ.2వేలు మినహాయించారన్నారు. 300 యూనిట్ల విద్యుత్తు ఉన్నా, కారు ఉన్నా.. అర్హులు కారనే నిబంధన గతంలో వ్యతిరేకించిన చంద్రబాబునాయుడు.. ఇపుడు అదే నిబంధన ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. డిగ్రీ చదివే విద్యార్థులు ఎందరుంటే అందరికీ ఇస్తామని చెప్పి, ఇపుడు ఫీజు రీయంబర్స్‌మెంట్ లింకు పెట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజశేఖర్ రెడ్డి, అభినయ్, రోని, మోహన్, శ్రీనివాసులు, ఖాసిం పీర్, శ్రీకాంత్, కిషోర్ పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.రవి డిమాండ్ చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న 48 వేల మంది మునిసిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం నిధులు జమకాకపోవడం అన్యాయమన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కార్మికులకు వర్తింపజేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయన్నారు. మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ, ఆశ కార్మికుల పిల్లలకు మొండిచేయి చూపారన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికులతోపాటు స్కీం వర్కర్లందరికీ తల్లికి వందనంతోపాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి ఇ.ప్రకాష్, డ్రైవర్ యూనియన్ కార్యదర్శి కిరణ్, నాయకులు నాగరాజు, సి.పి.అరుణ్, హరి, రవి, నరసింహులు, రాజా, హజరత్, నవకాంత్ సుబ్బరాయుడు, మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట భాషా పండితుల ధర్నా



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భాషా పండితులు

కడప ఎడ్యుకేషన్ : భాషా పండితులైన తమకు పదోన్నతి కల్పించి న్యాయం చేయాలని భాషా పండితులు విజయభాస్కర్, వెంకటరమణ కోరారు. కడప డీఈఓ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో జరిగిన లాంగ్వేజ్ పండిట్స్ ఉన్నతీకరణలో తమ పోస్టులను డీఈఓ పూల్‌బాషా మరొకరికి ఇవ్వడం జరిగిందన్నారు. ఆ రోజు నుంచి ప్రతి సాధారణ బదిలీలోనూ తమ అవసరం లేకున్నా బదిలీ చేస్తున్నారని తెలిపారు. భాషా పండితులకు న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఉన్నతీకరించిన పోస్టులను తమకే ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వతంత్రబాబు, భాషా పండితులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి కడప ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థులు శనివారం సంతాపం తెలిపారు. కళాశాలలో మెడికోలు, సిబ్బంది కలిసి రెండు నిమిషాలపాటు మౌనం పాటించి మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జవ్వాద్, ప్రిన్సిపల్ డాక్టర్ శైలరేఖ పాల్గొన్నారు.